

# చెర

ఎస్.నూర్ అహ్మద్

ఆ చిన్ని ఇంట్లో చాపపై కాళ్ళు బారచాపుకొని కూర్చున్నాడు వెంక టేశులు. మాసిన గడ్డం సమురు కుంటూ దీర్ఘాలోచనలో మునిగిఉన్నాడతను. ఇంతలో అతని ఆలోచనల్ని చెదరగొడుతూ... "ఓ బావా! లోపలున్నావా?" అంటూ నాగరాజు ఇంట్లోకి వచ్చాడు. వారిద్దరి మధ్యా ఏ చుట్టరికం లేకపోయినా స్నేహంలో ఉన్న చనువు కొద్దీ బంధుత్వాలు కలు పుకుంటూ పలకరించుకుంటారు. నాగరాజు పరామర్శకు బదులుగా వెంకటేశులు ఓ నవ్వు నవ్వి ఊరుకున్నాడు.

"ఏం, బావా! గడ్డం కూడా తీయించకుండా దేవదాసులా తయారయ్యావే, ఇంకా ఎక్కడా పని దొరకలేదా?" అని అడుగుతూ చాపపై చతికిలపడ్డాడు నాగరాజు.

"లేద్రా, ఆ సేట్ కారు నుంచి తీసేసిన తర్వాత ఎంత ప్రయత్నించినా ఇంకెక్కడా పని దొరకడంలేదు." బరువుగా బదులిచ్చాడు.

"ఎందుకు బావా మరీ అంతగా డీలావడ్తావు. చేతిలో విద్య ఉన్నోడివి. నీకు ఎక్కడైనా వని దొరుకుతుంది. అయినా ఈ రోజుల్లో కారు, జీవు డ్రైవర్లకు ఎంతో డిమాండ్ ఉన్న విషయం నీకు తెలియన్దా?" ధైర్యం చెప్పేవాడిలా అన్నాడతను.

అవున్రా డిమాండ్ ఉన్న మాట నిజమే అయినా 'దొంగ' అని ముద్ర వడిన వాడికి ఎవడిస్తాడ్రా ఉద్యోగం...

ఉన్నట్టుండి అతని స్వరం దుఃఖంతో పూడిపోయినట్లైంది.

అయినా నువ్వు చెప్పరా నేను పెట్రోలు దొంగిలించేంత నీచానికి పాల్పడతానంటావా?

ఏ అవమానపు జ్ఞాపకాలు అతని మదిలో కల్లోలం రేపాయో గానీ కళ్ళల్లో నీళ్ళు నిండుకుంటుండగా నాగరాజు చేతులు వట్టుకొని అడిగాడు వెంకటేశులు.

దాంతో కంగారువడిపోయాడు నాగరాజు.

ఛ, ఛ ఊర్కో బావా, జరిగింది తల్చుకొని బాధవడటం ఎందుగ్గానీ, ఎక్కడైనా వని కోసం ప్రయత్నించావా, లేదా" అంటూ ప్రశ్నించాడతను.

"ఇరవై రోజుల్నుండి ప్రయత్నిస్తూనే ఉన్నాన్రా, అయినా వని దొరకలేదు. దాంతో ఇల్లు గడవటం కూడా కష్టమైపోయింది. దీనికితోడు పావకు కాన్వెంట్ ఫీజు కట్టలేదని వాళ్ళు స్కూల్‌కి రానివ్వడంలేదు. ఒక రోజా, రెండ్రోజులా? ఇలా ఎన్నాళ్ళు గడపాలో అర్థం కావడం లేదురా,"

స్వంత మనిషితో చెప్పుకుంటున్నట్లు తన బాధలు ఏకరువు పెడుతూ చెప్పాడు వెంకటేశులు. ఎప్పుడు తాను ఆ ఇంటికి వచ్చినా కాఫీ కప్పుతో హాజరయ్యే అక్కయ్య! ఎందుకు ఎదురు వడలేదో అప్పటికి పూర్తిగా అర్థమైంది నాగరాజుకి.

దాంతో కొద్దిసేపు మౌనం వహించి కాసేపటికి మెల్లగా అన్నాడతను.

"బావా, నాకు తెలిసిన ఒక కంపెనీలో జీవు డ్రైవర్ ఉద్యోగం ఖాళీగా ఉంది. జీతం ఆరు వందలు కాకుండా పై నంపాదన కూడా ఆరేడు వందల దాకా ఉంటుందట." అని.

మరైతే ఆ ఉద్యోగం ఏదో నాకు ఇప్పించరా, నీకు పుణ్యముంటుంది, అంటూ చేతులు వట్టుకున్నాడు వెంకటేశులు.

కానీ... ఆ ఉద్యోగం అంత తేలిగ్గా దొరకదు బావా, ఎంతో నమ్మకస్తులైన వారి మాట గానీ ఆ కంపెనీలో వినరు, అయినా నా ప్రయత్నం నేను చేస్తాన్లే" అంటూ భరోసా ఇచ్చాడు నాగరాజు.

ఆ తర్వాత అతను బయటికి వెళ్ళిపోతూ, "బావా, నిన్ను రేప్పొద్దున కలుస్తాను. అంతదాకా ఖర్చులకు ఇది ఉంచుకో!" అంటూ ఓ వంద రూపాయల కాగితం వెంకటేశులు చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు.

మూడు రోజుల తర్వాత ఆ రోజే ఆ ఇంట్లో పొయ్యి రాజుకుంది.

***   ***   ***

రాత్రి తెల్లారింది.

జగతిపై కమ్ముకున్న చీకటి తెరలను ప్రచండ భానుడు చీల్చివేసి వెలుతురు నింపాడు.

ఇంటి బయటే నిలబడి నాగరాజు రాక కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న వెంకటేశులుకి వీధి మలుపులో వస్తున్న నాగరాజును చూడగానే ఎంతో నంతోషమేసింది.

"రా, రా..." అని ఆప్యాయంగా అతన్ని లోపలికి ఆహ్వానించాడు.

వెంకటేశులు భార్య లక్ష్మి అతనికి కాఫీ తెచ్చి ఇచ్చింది.

"ఏరా, అడిగావా... ఆత్రంగా అడిగాడు వెంకటేశులు.

"ఆ, అడిగాను, ఆ ఉద్యోగమైతే దొరుకుతుంది గాని, అది చేయడం కొంత కష్టమేమోననిపిస్తుంది"... అంటూ ఏదో ఒక నంశయంతో చెప్పుకొచ్చాడు నాగరాజు.

"అంత కష్టం ఏముంటుందిరా?" అనుమానంగా అడిగాడు.

"బావా, ఆ జీవులో ఏదో మత్తు మందు పొడర్‌ను పెద్దూర్ల నుండి తేవాలంట. అదీ పోలీసులకు తెలియకుండా తేవాలంట..." బదులిచ్చాడతను.

"అంటే స్మగ్లింగా...?"

అలాంటిది కాదనుకుంటా...!

'అసలా ఉద్యోగమే వద్దు లేరా! ఖర్మకాలి పోలీసులకు దొరికితే ఊచలు లెక్కపెట్టాల్సిందే. నాకెందుకులే ఆ వ్యవహారం' బరువుగ్గా చెప్పాడు వెంకటేశులు.

'అలా కొట్టిపారేయకు బావా, పోలీసులతో నీకే ప్రమాదం రాకుండా ఆ కంపెనీ వాళ్ళే చూసుకుంటారు. అసలు నువ్వు దొరికితే నీకంటే వాళ్ళకే కదా నష్టం ఎక్కువ... కనీసం వేరే ఉద్యోగం దొరికినన్నాళ్ళూ ఇది చెయ్యి, ఆ తర్వాత కావాలంటే మానేయ్'... అతన్ని నమాధానవర్చాడు నాగరాజు.

అతను చెప్పిందీ నబబుగానే అన్పించి ఆలోచనలో. వడ్డాడు వెంకటేశులు.

ఆ తర్వాత ఒక నిర్ణయానికి వచ్చిన వాడిలా అడిగాడు.

అక్కడికి ఎప్పుడెల్దాం? అని

వదకొండు గంటలకు నువ్వు ఆఫీసుకు వస్తే అక్కడ్నుంచి బయలుదేరి వెళదాం... అని చెప్పాడు నాగరాజు.

"నరే, అయితే నేను సిద్ధమై మీ ఆఫీసు దగ్గరికి వస్తాను..."

"ఇక నేను వస్తా బావా, వదకొండింటికి వచ్చేయ్!" అని వెళ్ళిపోయాడు నాగరాజు.

అతను ఓ ఆఫీసులో అటెండర్‌గా వనిచేస్తాడు.

***   ***   ***

మెత్తటి సోఫాలాంటి కుషన్ ఛైర్‌లో కూర్చుని ఎవరితోనో మాట్లాడుతున్నాడు రంగస్వామి. ఆ ప్రాంతంలోని వల్లెలకు కల్లు, సారాయి వంపిణీ చేసే కాంట్రాక్టర్లు అందరూ భాగస్వాములుగా ఉన్న కంపెనీకి అధ్యక్షుడతను.

నన్నగా, రివటలా ఉండి గట్టిగా గాలి వస్తే ఎగిరిపోయేలా ఉన్న అతను చాలా మామూలు బట్టలు వేసుకుని ఏమీలేని వాడిలా కనిపిస్తున్నాడు. అతని మొహం కూడా అమాయకంగానే ఉంది. అయితే అలా అనుకుంటే వప్పులో కాలేసినట్లే అంటారు అతన్ని గురించి తెలిసిన వారు. తనతో మాట్లాడుతున్న వారితో ఎంత వినయంగా ఉన్నాడో, అంతకంటే నమ్రతతో వారు అతనితో మాట్లాడుతున్నారు.

దాదాపు అరగంటదాకా వారితో మాట్లాడి వంపించిన తర్వాత అతని దగ్గరకు నాగరాజు, వెంకటేశులు వెళ్ళి నమస్కరించారు.

నాగరాజును చూసి వలకరింపుగా నవ్వాడు రంగస్వామి. ఆ తర్వాత ఏమిటన్నట్లు కనుబొమ్మలు ఎగురవేశాడు.

"మీ కంపెనీలో జీవు డ్రైవర్ ఉద్యోగం ఖాళీగా ఉందని ఇతన్ని పిల్చుకొచ్చాను" వినయంగా అన్నాడు నాగరాజు.

వెంకటేశులు వంక వరిశీలనగా చూశాడు రంగస్వామి. ఆ తర్వాత అడిగాడు "మనిషి నమ్మకస్తుడేనా?"

"చాలా నమ్మకస్తుడన్నా మీరు చెప్పినట్లు వింటాడు." నాగరాజు చెప్పాడు.

"నరే, అలాగైతే నీ మాట మీద నాకు అమాత్రం నమ్మకం ఉంది." అంటూ వెంకటేశులు వైపు తిరిగి చెప్పాడు రంగస్వామి.

"చూడూ, మా కంపెనీలో ఎంత కష్టవడితే అంత ఫలితం ఉంటుంది. నమ్మకంగా ఉంటే ఏం కావాలన్నా దొరుకుతుంది. నువ్వు నమ్మకంగా ఉన్నన్నాళ్ళూ నీకే హానీ జరగకుండా చూసే పూచీ నాది" అన్నాడు.

అలాగే అంటూ వినయంగా తల ఊపాడు వెంకటేశులు.

మాసిన గడ్డం, లోతుకు పోయిన కళ్ళు, కాళ్లకు అరిగిపోయిన చెప్పులతో కష్టాలకు ప్రతిరూపంగా ఉన్న వెంకటేశులి వరిస్థితి అంచనా వేసినట్లుగా మళ్లీ చెప్పాడు రంగస్వామి. "నీకు డబ్బు అవనరం ఉన్నట్లుంది. మా మేనేజర్ దగ్గరకెళ్లి ఈ నెల జీతం ఆరొందలూ అడ్వాన్స్‌గా తీసుకో. రేపట్నుంచి వన్లోకి రా!" అని చెప్పాడు.

ఆ మాటలు వినడంతోటే రంగస్వామి వట్ల కృతజ్ఞతతో తల వంచాడు వెంకటేశులు.

"నర్లే, నువ్వింక వెళ్లు" అన్నాడు రంగస్వామి.

వెంకటేశులు, నాగరాజు ఇద్దరూ కలిసి ఆ కంపెనీ మేనేజర్ దగ్గరికి వెళ్లారు.

అక్కడతను ఇచ్చిన కాగితాలపై నంతకం పెట్టి జీతం అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. ఇక రేపట్నుంచి తన భార్యాపిల్లలు వస్తులుండాల్సిన అవనరం లేదన్న విషయమే వెంకటేశులుకు ఎనలేని ఆనందం కలిగిస్తోంది.

అందుకే ఎంతో నంతోషంగా అక్కడి నుండి నాగరాజుతో కలిసి ముందుకు కదిలాడతను. అయితే అతనికి తెలియదు, తానెలాంటి విషవలయంలో చిక్కుకున్నాడో! అదే తెలుసుంటే అతని ఆనందం కాస్తా ఆవిరై ఉండేది.

★ ★ ★

ఇది జరిగి దాదాపు మూడు నెలలు గడిచిపోయాయి.

ఇప్పుడు వెంకటేశులు అవతారంలో కొన్త మార్పు వచ్చింది. మనిషి ముఖంలో కొస్త కళ వచ్చింది. అతను చేసే వనేమిటంటే ఆ కల్లు కంపెనీకి కావాల్సిన ఏదో పొడర్‌ను బయటి ఊరునుండి నెలలో మూడు, నాలుగు సార్లు తేవడం. అవనరమైనప్పుడు వల్లెల్లోని షాపుల దగ్గరకు వెళ్లి రావడం మాత్రమే అతను చేస్తాడు. తాను తెచ్చే పొడర్‌ను కల్లులో మత్తు కలిగించేందుకు కలుపు

తారని మాత్రమే అతనికి తెలును. అంతకుమించి మరే విషయమూ తెల్సుకోదల్చుకోలేదనే చెప్పాలి.

ఒకటి, రెండుసార్లు భయపడుతూ ఆ పౌడర్‌ను తేవడానికి వెళ్లొచ్చిన అతను ఇప్పుడు ఆ భయమేమీ లేకుండా నిర్భయంగా తెస్తున్నాడు. పైగా బయటి ఊరికి వెళ్లి వచ్చినప్పుడల్లా అతనికి వంద రూపాయలు బక్షీష్‌గా దొరుకుతుండడంతో అతను సంతోషంగా వెళ్లి వస్తున్నాడు. కానీ అతనికి తెలియదు, తాను చేస్తున్న పని ఎలాంటిదో, దాని పర్యవసానం ఎలా ఉంటుందో?

★ ★ ★

ఏడుపులూ, పెడబొబ్బలూ విన్పిస్తున్న ఆ ప్రాంతంలో లోకంలోని రోదనంతా రూపు దాల్చినట్లు ఉంది. అక్కడ ఊపిరి ఆగిపోయిన వారి శవాలను చూస్తూ వారి కుటుంబీకులు గుండెలు పగిలేలా విలపిస్తున్నారు. కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వారిని చూస్తూ గుండెలు బాదుకుంటున్నారు. ఇంకా బ్రతికి ఉన్న వారిని ఆస్పత్రికి తరలించడం ప్రారంభించారు.

అయితే అప్పటికే ఎందరో బలయిపోయారు.

మొత్తం మీద పదకొండు మంది దాకా మరణించగా, ముప్పై మంది వరకూ ఆస్పత్రి పాలయ్యారు. దీనికంతటికీ కారణం రంగస్వామి కంపెనీ తయారుచేసే కల్లు తాగడమే. అందులో కలిపే మత్తు మందు పొడి అధికంగా వాడడంతో ఆ మత్తు కాస్తా మృత్యువుగా విజృంభించింది. ఎన్నో జీవితాలను బుగ్గిపాలు చేసి, ఇంకెన్నో కుటుంబాలను బజారుపాలు చేసింది.

ఈ సంఘటనలో ఎవరో అనామకులు అరెస్టయ్యారు. కేసులు రిజిస్టరై కోర్టుదాకా వెళ్లిపోయాయి.

ఈ గొడవంతా ఓ నెల రోజులదాకా జనం గుర్తుపెట్టుకున్న ఆ తర్వాత మెల్లమెల్లగా మర్చిపోవడం ప్రారంభించారు.

మళ్లీ మామూలుగానే తాగుడుకు బానిసలైన వారు తాగడం మొదలుపెట్టారు.

కానీ జరిగిన సంఘటనను మర్చిపోలేని ఒకే ఒక వ్యక్తి ఎవరంటే వెంకటేశులు. జరిగిన దుర్ఘటన అతనికి ఒక షాక్‌లా తగిలింది.

తాను తెచ్చే పౌడర్ వల్లనే ఈ అనర్థం జరిగిందని తెలిసినప్పుడు ఒక్క క్షణంపాటు నిర్ఘాంతపోయాడు. ఆ క్షణంలోనే పాపభీతితో వణికిపోయాడు.

చనిపోయిన కుటుంబాల వారి బంధు వర్గాలు పెడ్తున్న శాపనార్థాలన్నీ తనకే తగులు తున్నట్లుగా తల్లడిల్లి పోయాడతను.

కానీ ఆ పరిస్థితులలో తాను చేయగలిగిందేమిటో అర్థం కాక మౌనం దాల్చాడతను.

అయినా అనుక్షణం ఆ సంఘటనను మరచిపోలేక పోతున్నాడతను....

* * * * * *

పక్కూరి నుండి జీపులో మత్తు మందు పొడిని తెస్తున్న వెంకటేశులు ఆలోచనలు జీపు కంటే వేగంగా పరుగులు తీస్తున్నాయి.

ఆ సంఘటన తర్వాత తొలిసారిగా మళ్ళీ ఆ మత్తు పొడరు తెస్తున్నాడతను.

మళ్ళీ ఈ పౌడర్ తేవడం మొదలు పెడితే ఈ రోజు కాకపోయినా, రేపైనా మళ్ళీ అలాంటి దుర్ఘటనే తప్పకుండా జరుగుతుంది.

పోనీ తనే ఈ పని మానేద్దామనుకుంటే, తాను కాకపోయినా మరొకరు ఈ స్థానంలో వచ్చి ఈ పనేచేస్తారు.

అదే జరిగితే తనవల్ల జరిగిపోయిన దుష్కృతికి ప్రాయశ్చిత్తం ఎలా జరుగుతుంది.

అతని ఆలోచనలు అంతు లేకుండా సాగుతున్న సమయంలోనే అతనో స్థిర నిర్ణయానికి వచ్చాడు.

దాంతో ఊరి బయటే నిలిచిపోయి అక్కడి నుంచి ఒక ఫోన్ ద్వారా ఎవరితోనో మాట్లాడి ఆ తర్వాత ఓ ఐదునిమిషాలాగి పట్టణంలోకి వెళ్ళాడు.

అతని జీపు కల్లు కంపెనీ సమీపంలోకి చేరక ముందే పోలీసులు అతన్ని ఆపి, జీపు సోదా చేసి ఆ మత్తు మందు పౌడర్‌తో సహా అరెస్ట్ చేశారు.

అరెస్ట్ కావడానికి సిద్ధంగా ఉన్నట్లుగా పోలీసులను ప్రతిఘటించకుండానే వెంకటేశులు వారికి లొంగిపోయాడు.

ఆ తర్వాత పోలీసులు అడిగిన ప్రశ్నలన్నింటికీ నిజాలను చెప్పేసి కటకటాల వెనక్కి వెళ్ళాడు.

ఇప్పుడు అతనికి ఎంతో తృప్తిగా ఉంది.

తాను అరెస్ట్ అయినా ఫరవాలేదు. కొన్ని నెలలు శిక్షపడినా తాను పట్టించుకోడు. ఎంతో మందిని పొట్టన పెట్టుకున్న రంగస్వామి లాంటి వారు మాత్రం కొన్నాళ్ళు అయినా ఊచలు లెక్కపెట్టాలి. వారి నిజస్వరూపాలు ప్రజలకు తెలియాలి. ఈ ఘోరాలకు కారణం వారేనని అందరికీ తెలియాలి.

ఆ దృఢనిశ్చయంతోనే వెంకటేశులు స్వయంగా పోలీసులకు సమాచారం అందించి, వారికి సాక్ష్యాధారాలతో సహా లొంగిపోయాడు.

అయితే తానే ఈ పని చేశాడని ఎవరికీ అనుమానం రాకూడదనే తన పేరు చెప్పకుండా పోలీసులకు ఫోన్‌లో సమాచారం చెప్పాడు.

వెంకటేశుల్ని అరెస్ట్ చేసిన పోలీసు అధికారి కాస్త నిజాయితీ కలిగిన వాడు కావడంతో వెంకటేశులు ఇచ్చిన సమాచారం ప్రకారంగా రంగస్వామిని అరెస్ట్ చేయబోయాడు.

కానీ భయపడి ఎక్కడికైనా పరారైపోయాడో, పనుండి ఎక్కడికైనా వెళ్ళిపోయాడో తెలియదు గానీ రంగస్వామి అతనికి దొరకలేదు.

వెంకటేశుల్ని అరెస్ట్ చేసిన తర్వాత నాలుగు రోజులకు గానీ అతను పోలీసులకు కన్పించలేదు.

రంగస్వామి ఊళ్ళోకి వచ్చాడని తెలియగానే అతన్ని అరెస్ట్ చేయాలని బయలు దేరి వెళ్ళిన పోలీసు అధికారి రిక్తహస్తాలతో వెనక్కి వచ్చాడు.

రంగస్వామి దగ్గర ముందస్తు బెయిల్ ఉండటంతో అతన్ని అరెస్ట్ చేయలేక పోయాడతను.

ఈ విషయాలేమీ వెంకటేశులుకు తెలియవు.

* * * * * *

ఆరోజు రంగస్వామి నరాసరి స్టేషన్‌కు వచ్చి ఎస్.ఐతో చాలా సేపు మాట్లాడి ఏవో కాగితాలు చూపించి అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

వెళ్ళిపోతూ అతను వెంకటేశులు ఉన్న సెల్ దగ్గరికి వచ్చి అతన్ని పలుకరించాడు.

అతన్తో మొక్కు బడిగా మాట్లాడి వెళ్ళిపోతూ అతన్ని చూసి రంగస్వామి నవ్విన నవ్వు వెంకటేశులు గుండెల్లో ఏదో తెలియని గుబులు రేపింది.

అసలు ఏ ధైర్యంతో రంగస్వామి అంత ధైర్యంగా ఉన్నాడో అతనికి అర్థంకాలేదు.

రంగస్వామి వెళ్ళిపోయిన కాసేపటికే వెంకటేశుల్ని ఎస్.ఐ. పిలిపించాడు.

అక్కడ ఎస్.ఐ చెప్తున్న మాటలు వింటుంటే వెంకటేశులి గుండెల్లో రాళ్ళు పడినట్లయింది.

కళ్ళ ముందు కన్పించని చీకటి తెరలు కట్టినట్లై తూలిపడబోయి గోడ ఆసరాతో నిలబడిన అతని చెవుల్లో ఎస్.ఐ. చెప్పిన మాటలే ప్రతిధ్వనిస్తున్నాయి.

"చూడు వెంకటేశులూ, ఆ జీపు నువ్వు చెప్పినట్లుగా రంగస్వామిదే అయినా అందులో నువ్వు తెచ్చిన పౌడర్ తాను తెప్పించలేదని అతను అంటున్నాడు. అంతేకాకుండా ఆ జీపు నీకు రెండేళ్ళపాటు లీజుకు ఇచ్చానని అందువల్ల దానిలో పట్టుకున్న మత్తు పౌడర్‌తో తనకే సంబంధం లేదని అంటున్నాడు. నువ్వు రెండేళ్ళ పాటు లీజుకు తీసుకుంటూ చేసిన అగ్రిమెంట్ కాగితాలు కూడా అతను నాకు తెచ్చి చూపాడు. ఇక ఈ కేసులో అతనికేం జరిగేది ఉండదు. ఏం జరిగినా, జరిగేది నీకే.....

ఈ విషయంలో నీకేం సహాయం చేయలేక పోతున్నా....

నిజాయితీ కలిగిన ఆ అధికారి నిజాన్ని గుర్తించినా ఏమీ చేయలేని నిస్సహాయతతో చెప్తున్నాడు. ఆక్రోశిస్తున్న వెంకటేశులుకు అతను తొలి నెల జీతం అడ్వాన్సుగా తీసుకోబోయే ముందు తాను సంతకం పెట్టిన కాగితాలు మాత్రం గుర్తుకు రాలేదు.

దుఃఖంతో ఆక్రోశిస్తున్న అతన్నిమళ్ళీ లాకప్‌లో పంపించేశారు.

మోకాళ్ళపై కూర్చొని తలవంచుకొని నిశ్శబ్దంగా వెక్కుతున్న అతని దుఃఖానికి నిదర్శనంగా అతని డొక్కలు ఎగిసిపడుతున్నాయి.

* * * * * *

మత్తు మందు పొడి కేసు కోర్టుకు ఇంకా రాక ముందే రంగస్వామి కోర్టులో ఒక పిటీషన్ పెట్టుకున్నాడు.

అదేమంటే వెంకటేశులు తన వద్ద నుంచి జీపు లీజుకు తీసుకొని అందులో చట్ట విరుద్ధమైన పనులు చేశాడు కాబట్టి అతనితో తనకున్న లీజు ఒప్పందాన్ని రద్దు చేస్తూ తన జీపును పోలీసుల నుంచి విడిపించాలని అతను కోర్టు వారిని కోరుకున్నాడు.

తత్ఫలితంగానే కొన్నాళ్ళకు ఆ జీపుకు పోలీసుల చెరనుండి విముక్తి లభించింది. దాంతో అతని జీపుకు కొత్త డ్రైవర్ వచ్చాడు. మళ్ళీ పాతపని మొదలు పెట్టాడు.

తెరవెనుక జరిగిన భాగోతానికి ప్రత్యక్ష సాక్షిగా ఉన్న జీపు స్వేచ్ఛగా తిరుగుతుంటే వెంకటేశులు మాత్రం వెలుగులోకి రాని నిజంగా చీకటి చెరలో మగ్గిపోతూనే ఉన్నాడు. ◆